క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి



పోకల రాంబాబును అభినందిస్తున్న దృశ్యం

దెందులూరు: వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబరుగా పోకల రాంబాబును నియమిస్తూ ఏలూరు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ళనాని శుక్రవారం లిఖితపూర్వక ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం దెందులూరులో జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబరుగా నియమితులైన పోకల రాంబాబు మాట్లాడుతూ తనను పార్టీ జిల్లా కమిటీ మెంబరుగా నియమించడానికి పూర్తి సహాయసహకారాలు అందించిన ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు, పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, జిల్లా అధ్యక్షుడు ఆళ్ళ నానికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని పోకల రాంబాబు అన్నారు.

పేదలకు వరం ఫ్యామిలీ డాక్టర్

గణపవరం: గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం వరంలాంటిదని, ఈకార్యక్రమాన్ని రోగులు వినియోగించుకోవాలని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారిణి కిరణ్మయి అన్నారు. శుక్రవారం గణపవరంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా ఇళ్లకు పరిమితమైన రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. సీహెచ్‌వో జాలాది విల్సన్, ఆరోగ్య సహాయకుడు నామాలరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గాదిరాజు నియామకంపై వైఎస్సార్ సీపీ నేతల హర్షం



ఎమ్మెల్యే వాసుబాబును మర్యాదపూర్వకంగా కలిసిన గాదిరాజు సుబ్బరాజు

గణపవరం: తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యుడిగా నిడమర్రు మండలం మందలపర్రుకి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, పార్టీ రాష్ట్ర పాలకవర్గ సభ్యుడు గాదిరాజు సుబ్బరాజు నియామకంపై వైఎస్సార్ సీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల టీటీడీ బోర్డు చైర్మన్‌గా నియమితులైన భూమన కరుణాకరరెడ్డి ప్రకటించిన బోర్డు సభ్యులలో గాదిరాజు సుబ్బరాజుకు అవకాశం లభించింది. ఈయన పార్టీ ఆవిర్భావం నుంచి క్రియాశీలకంగా పనిచేస్తూ, పార్టీ రాష్ట్రస్థాయి నాయకులతో మంచి సంబంధాలు కలిగి ఉన్నారు. మూడు దశాబ్దాల క్రితం ఈప్రాంతానికి చెందిన వేగేశ్న కనకరాజు టీటీడీ బోర్డు అధ్యక్షుడిగా పనిచేశారు. ఇన్నేళ్లకు గణపవరం ప్రాంతానికి చెందిన సుబ్బరాజుకు అవకాశం రావడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈయన నియామకంపై ఎమ్మెల్యే వాసుబాబు, గణపవరం, నిడమర్రు మండలాల మండల అధ్యక్షుడు అర్ధవరం రాము, ధనుకొండ ఆదిలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కోడే కాశీ, దేవారపు సోమలక్ష్మి పార్టీ మండల కన్వీనర్లు దండు రాము, సంకు సత్యకుమార్, పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు.

ఆలపాటిపై సస్పెన్షన్ వేటు

దెందులూరు: మొండూరు గ్రామానికి చెందిన ఆలపాటి నర్సింహమూర్తిపై వైఎస్సార్ సీపీ అధిష్టానం సస్పెన్షన్ వేటు వేసింది. ఆలపాటి నర్సింహమూర్తి వైఎస్సార్ సీపీలో ఉంటూ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు చేస్తున్నట్లుగా ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే ఫిర్యాదును పరిశీలించిన తరువాత అందులో పేర్కొన్న అంశాలు నిజమని అధిష్టానం నిర్ధారించింది. ఉభయగోదావరి జిల్లాల వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్లు పీ మిథున్‌రెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్ ఆదేశాల మేరకు ఏలూరు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ళనాని ఆలపాటి నర్సింహమూర్తిని వైఎస్సార్ సీపీ నుంచి సస్పెండ్ చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు శుక్రవారం లిఖితపూర్వ ఆదేశాలు జారీ చేశారు.

బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి

భీమడోలు: బీజేపీ అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాల వల్ల నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్.లింగరాజు అన్నారు. భీమడోలులోని సీపీఎం కార్యాలయంలో శుక్రవారం ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని గుత్తికొండ వెంకట కృష్ణారావు అధ్యక్షతన నిర్వహించారు. వాల్‌పోస్టర్లను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్.లింగరాజు మాట్లాడుతూ జీఎస్టీ వల్ల రూపాయి విలువ పతనమైందని, పెట్రోలు, డీజిల్ ధరలు ఆకాశాన్నంటాయన్నారు. నిరుద్యోగం పెరిగిందన్నారు. సమస్యల సాధనకు ఈనెల 26 నుంచి వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు కట్టా భాస్కరరావు, నారపల్లి రమణారావు, పి.నాగరాజు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం



గుండుగొలనులో నూతనంగా నిర్మించిన సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

భీమడోలు: భవిష్యత్తులో విద్యుత్ సమస్య తలెత్తకుండా నాణ్యమైన కరెంట్‌ను ప్రజలకు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. భీమడోలులో రూ.3.50కోట్ల వ్యయంతో నిర్మించిన 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. హర్షధ్వానాల నడుమ స్విచ్చాన్ చేసి సబ్‌స్టేషన్‌ను ప్రారంభించి జాతికి అంకితం చేసారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి విద్యుత్ శాఖ ఎస్ఈ సాల్మన్‌రాజు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు మాట్లాడుతూ ఈ సబ్‌స్టేషన్ నిర్మాణంతో ఈ ప్రాంతవాసుల చిరకాల వాంఛ తీరనుందన్నారు. ప్రజల అవసరాల రీత్యా విద్యుత్ వినియోగం గణనీయంగా పెరగడంతో అధిక లోడు వల్ల తరచూ విద్యుత్ అంతరాయాలు ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వాటిన్నింటికీ చెక్ పెట్టేందుకు అవసరమైన చోట్ల సబ్ స్టేషన్ల నిర్మాణం, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. గుండుగొలను సబ్‌స్టేషన్ వల్ల 10వేల గృహ నిర్మాణ వినియోగదారులకు, పరిశ్రమలకు హెచ్చుతగ్గులు లేని నాణ్యమైన కరెంట్‌ను అందిస్తామన్నారు. గుండుగొలను, వడ్డిగూడెం, భోగాపురం, రత్నాపురం, కోరుకల్లు, పెదలింగంపాడులోని ప్రజలకు విద్యుత్ సమస్య పూర్తి స్థాయిలో తీరుతుందన్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలోని జగనన్న కాలనీల్లో కోట్లాది రూపాయలతో నూరుశాతం కొత్తగా విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయడం, ఇంటింటికీ విద్యుత్ సదుపాయాలను కల్పించారన్నారు. నిడమర్రు, గుండుగొలనులో సబ్‌స్టేషన్లలో ఏర్పాటు చేయగా అవసరమైనట్లయితే 5 ఎంవీలను ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలోని గణపవరం, కేశవరం, రాచూరి, తోకలపల్లి, రాచూరు గ్రామాల్లో సబ్‌స్టేషన్ నిర్మాణాలకు అవసరమైన స్థలాల సేకరణ జరిగిందని, పూర్తి స్థాయి అనుమతులు రాగానే వాటిని నిర్మిస్తామన్నారు. నిడమర్రు, గణపవరం మండలాల్లో రైతులు, ఆక్వా రైతులు ఎక్కువగా ఉన్నందున గణపవరంలలో రూ.120 కోట్లతో 132 సబ్‌స్టేషన్ నిర్మాణానికి కృషి చేస్తున్నామన్నారు. విద్యుత్ శాఖ ఎస్ఈ పి.సాల్మన్‌రాజుతో పాటు వారి బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. అనతికాలంలోనే సబ్‌స్టేషన్‌ను నిర్మించి ప్రజలకు కరెంట్ అవసరాలను తీర్చారన్నారు. ఏఈ రాళ్లపల్లి భీమేశ్వరరావు ఈ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ప్రధాన భూమికను పోషించారన్నారు. ఎస్ఈ పి.సాల్మన్‌రాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రూ.400 కోట్లతో ఆర్‌డీసీసీ వంటి సాంకేతిక పరిజ్ఞానంతో లో ఓల్టేజి సమస్యకు శాశ్వతంగా పరిష్కరించేందుకు అన్ని చర్యలు చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ముదుండి సూర్యనారాయణరాజు, దేవస్థానం పాలకవర్గం సభ్యుడు చిలువూరి సత్యనారాయణరాజు, ఎంపీపీ కనమాల రామయ్య, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, వైస్ ఎంపీపీ డోకల వాసంతి, ఎంపీటీసీ నత్తా నాగిని, ఎంపీడీవో సీహెచ్ పద్మావతి దేవి, ట్రాన్స్‌కో ఈఈ శశిధర్, నిర్మాణ విభాగం డీఈ వెంకటేశ్వరరావు, డీఈఈ కె.గోపాలకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ షంషుద్దీన్, సచివాలయాల కన్వీనర్ మద్దుల రాజా, మండల సాగు సలహా మండలి చైర్మన్ పసుపులేటి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ చైతన్య యువజన సంఘం అధ్యక్షుడు డాక్టర్ పాము మాన్‌సింగ్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, జిల్లా నాయకులు వగ్వాల అచ్యుతరామారావు, నంద్యాల సుబ్బరాజు, సచివాలయ కన్వీనర్ జి.మురళీ, వక్ఫ్‌బోర్డు సభ్యుడు జహీర్, సచివాలయ ఉద్యోగులు, నాయకులు నల్ల శంకర్, నల్ల శ్రీనివాసరావు, బర్ల రమణమూర్తి పాల్గొన్నారు.

‘గడపగడపకు’ కార్యక్రమంతో గ్రామాల్లో మార్పు

- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి
- పోతునూరులో పర్యటన



పోతునూరులో మహిళలకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

దెందులూరు: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంతో గ్రామాల్లో స్పష్టమైన మార్పు కనిపిస్తోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రజలు ఇబ్బందులను ప్రత్యక్షంగా తెలుసుకుని వాటిని పరిష్కరించడంతోపాటు, అర్హులకు పథకాలు అందించేందుకు, అభివృద్ధి పనులను సమీక్షించేందుకు ఈకార్యక్రమం దోహదపడుతోందని ఆయన అన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి అన్నారు. శుక్రవారం రాత్రి పోతునూరులో దెందులూరు ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత, సర్పంచ్ బోదుల స్వరూప్, సొసైటీ అధ్యక్షుడు డీఎన్‌వీ ప్రసాద్ (బజ్జి), పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొఠారు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రజాప్రతినిధులు, అధికారులను ప్రజలకు వద్దకు పంపించి సమస్యలు పరిష్కరింపజేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, రేషన్ డీలర్ల జిల్లా అధ్యక్షులు తలారి రామకృష్ణ, పార్టీ నాయకులు రమేష్, బీశెట్టి నూకరాజు, రమేష్, బుద్దా అర్జున, పెనుగంటి అప్పారావు, మల్లా సత్తిపండు, పిల్లా శ్రీనివాస్, వలంటీర్లు, గృహసారదులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు ఉన్నారు.

నేడు సత్యవోలులో గడపగడపకు మన ప్రభుత్వం

పెదపాడు: మండలంలోని సత్యవోలు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించనున్నట్టు బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, మండల కన్వీనర్ అప్పన ప్రసాద్ తెలిపారు. సత్యవోలులో మధ్యాహ్నం 3గంటల నుంచి రాత్రి 9గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ముఖ్య అతిథిగా పాల్గొంటారని చెప్పారు.

మద్దుల కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

దెందులూరు: వైఎస్సార్ సీపీ నాయకులు మద్దుల వినోద్ ఆకస్మిక మరణం తనను కలిచివేసిందని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. వినోద్‌ను ఆస్పత్రికి వెళ్లి పరామర్శించానని, సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి తిరిగి వస్తారని భావించనన్నారు. వినోద్ మృతికి ఎమ్మెల్యే సంతాపం తెలిపారు. ఎమ్మెల్యే కొఠారుతోపాటు ఎంపీటీసీ సున్నా నరేష్, వినోద్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

జగనన్న ఇల్లు గృహప్రవేశం

పోతునూరులో జగనన్న కాలనీలో 3వ వార్డు మెంబరు దారం తంబి ఇల్లు నిర్మించుకున్నారు. శుక్రవారం గృహప్రవేశం చేయడంతో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేసి, కుటుంబ సభ్యులకు నూతన వస్త్రాలు అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, సర్పంచ్ బోదుల స్వరూప్, సొసైటీ అధ్యక్షుడు డీఎన్‌వీ ప్రసాద్ (బజ్జి), రేషన్ డీలర్ల జిల్లా అధ్యక్షులు తలారి రామకృష్ణ, పార్టీ నాయకులు బీశెట్టి నూకరాజు,రమేష్ ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



దెందులూరులో అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ప్రత్యేకాధికారి కృపావరం

దెందులూరు: మండల ప్రత్యేకాధికారులు ప్రతి శుక్ర, శనివారాలు గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తనిఖీ చేయాలన్న కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు దెందులూరు మండల ప్రత్యేకాధికారి కృపావరం దెందులూరులో అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. మహిళలకు, పిల్లలకు అందుతున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. బరువు తక్కువ ఉన్న పిల్లలను గుర్తించారు. వారి తల్లిదండ్రుల ఇళ్లకు వెళ్లి పౌష్టికాహారం పంపిణీపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

జిల్లాకు ఆదర్శంగా చేబ్రోలు జగనన్న కాలనీ



చేబ్రోలు జగనన్న కాలనీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

ఉంగుటూరు: చేబ్రోలు జగనన్న కాలనీని జిల్లాలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. శుక్రవారం ఆయన చేబ్రోలులోని వైఎస్సార్ జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు, వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. త్వరలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా వర్చువల్ విధానంలో ప్రారంభం కానున్న వాటిలో చేబ్రోలు కాలనీ కూడా ఉందని తెలిపారు. త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కాలనీలో రూ.48 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న రోడ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. కాలనీలో గృహాలను సందర్శించి లబ్దిదారులతో మాట్లాడారు. మొత్తం 330 ఇళ్లకు ఇప్పటికే 181 గృహాల నిర్మాణం ప్రారంభించగా, దాదాపు 100 గృహాల నిర్మాణం పూర్తయ్యాయని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని అధికారులు వివరించారు. ఇప్పటికే కాలనీలో విద్యుత్, మంచినీటి సౌకర్యం కల్పించామని, రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణ పనులు చేస్తున్నామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గృహనిర్మాణశాఖ డీఈ సోమేశ్వరరావు, ఏఈ సురేష్, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ మరడ మంగారావు, నాయకులు బుజ్జి, ఆకుల రాజా, కరణం బుజ్జి పాల్గొన్నారు.

వంతెన నిర్మాణ పనులు వేగవంతం

భీమడోలు: జాతీయ రహదారి అనుకుని గుండుగొలను వంతెన నిర్మాణం నాలుగైదు నెలల్లో పూర్తి అవుతుందని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. గుండుగొలనులో రూ.3.30 కోట్ల వ్యయంతో వంద టన్నుల సామర్థ్యం గల నూతన వంతెన నిర్మాణ పనులను శుక్రవారం పరిశీలించారు. నిర్మాణ పనుల ప్రగతిని సంబంధిత కాంట్రాక్టర్, హైవే అథారిటీ విభాగం ప్రతినిధుల నుంచి ఆయన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వాసుబాబు మాట్లాడుతూ ఏలూరు కాలువపై గుండుగొలను వద్ద శిథిలమై కూలిపోయిన వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. ఇప్పటికే బెయిలీ వంతెనను నిర్మించామన్నారు. ఈ వంతెన పూర్తయితే కొల్లేరు పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఉపసర్పంచ్ ముదుండి సూర్యనారాయణరాజు, ఎంపీపీ కనమాల రామయ్య, మండల వైసీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, జిల్లా నాయకులు చిలువూరి సత్యనారాయణరాజు, నంద్యాల సుబ్బరాజు, వగ్వాల అచ్యుతరామారావు, కాంట్రాక్టర్ అఖిల్, వార్డు సభ్యులు గొటికల మురళీ, నల్ల శంకర్, వక్ఫ్ బోర్డు సభ్యుడు జహీర్, జిల్లా చైతన్య యువజన సంఘం అధ్యక్షుడు పాము మాన్‌సింగ్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు కొమ్మరలో గడపగడపకు..

గణపవరం: మండలంలోని జల్లికొమ్మరలో శనివారం మధ్యాహ్నం 3 గంటలకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎమ్మెల్యే వాసుబాబు ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు, పాల్గొనాలని క్యాంపు కార్యాలయం ప్రతినిధులు రవి, సుభాష్ కోరారు.

గడపగడపకు సంక్షేమం.. ఇంటింటా ఆనందం



జల్లికొమ్మరలో వృద్ధులకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం: వైఎస్ జగన్ నాలుగున్నరేళ్ల పాలన గడపగడపకు సంక్షేమం అన్నట్లుగా సాగుతుందని, పేదల సంక్షేమానికి ఇంతటి ప్రాధాన్యత ఇచ్చిన ప్రభుత్వం ఇంతవరకూ లేదని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. శుక్రవారం గణపవరం మండలం జల్లికొమ్మరలో నిర్వహించిన 197వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరిగి వారికి ఇంతవరకూ అందిన పథకాలను వివరించారు. పథకాలకు సంబంధించిన బ్రోచర్లు అందజేశారు. నాలుగున్నరేళ్లలో దాదాపు రూ.2 లక్షల కోట్లు లబ్దిదారుల ఖాతాలలోకి ప్రభుత్వం నేరుగా జమ చేసిందని పేర్కొన్నారు. పలువురిని ఆయన సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారు. ఈకార్యక్రమంలో గణపవరం ఎంపీపీ అర్ధవరం రాము, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ దండు రాము, సర్పంచ్ కురెళ్ల వెంకటరత్నం, ఎంపీటీసీ సభ్యుడు బుద్దాల వెంకటేశ్వరరావు, ఉపసర్పంచ్ తంగెళ్ల శ్రీనివాసరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు కురెళ్ల త్రిమూర్తులు, సొసైటీ అధ్యక్షుడు బుద్దాల అర్జున్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిక

గ్రామానికి చెందిన పలువురు వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే వాసుబాబు వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ప్రభుత్వ విధానాలు ప్రజలకు అనుకూలంగా ఉన్నాయని, పేదలకు జగన్ పాలనలోనే న్యాయం జరుగుతుందని భావించి వైఎస్సార్ సీపీలో చేరుతున్నట్లు అడ్డగర్ల శ్రీనివాసరావు, తంగెళ్ల సూర్యారావు, సేలం నారాయణరావు, తంగెళ్ల శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా పది కుటుంబాల వారు పార్టీలో చేరారు.

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి



అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, ఆశలకు అవగాహన కల్పిస్తున్న మండల ప్రత్యేక అధికారి

పెదపాడు: గర్భిణులు, రక్తహీనత లేకుండా పౌష్టికాహారం తీసుకోవాలని పెదపాడు మండల ప్రత్యేక అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ తెలిపారు. పెదపాడు మండలంలోని అప్పనవీడులోని అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. అంగన్‌వాడీల్లో లబ్ధిదారుల వివరాలు, రక్తహీనతతో బాధపడుతున్న వారి వివరాలు తెలుసుకుని వారికి అవగాహన కల్పించారు. గర్భిణులకు అంగన్‌వాడీల్లో అందిస్తున్న పౌష్టికాహారాన్ని తీసుకుని రక్తహీనత లేకుండా చూసుకోవాలన్నారు. అనంతరం ఇటీవల పదో తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థుల ఇంటికి వెళ్లి వారిని చదువుకోవాలని అవగాహన కల్పించారు. రక్తహీనత ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి వారికి పోషకాహారాన్ని అందించాలని సూచించారు. పెదపాడు మండల విద్యాశాఖాధికారి డీవీ రమణ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఫాతిమా, ఆశాలు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

ప్రజలకు సక్రమంగా పథకాలు అందజేయాలి



పోలసానిపల్లిలో సిబ్బంది ప్రగతిని సమీక్షిస్తున్న డీఆర్‌డీఏ పీడీ, ప్రత్యేకాధికారి ఆర్.విజయరాజు

భీమడోలు: గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు సమర్థవంతంగా పథకాలు అందించాల్సిన బాధ్యత సంబంధిత ఉద్యోగులదేనని మండల ప్రత్యేకాధికారి, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు అన్నారు. పోలసానిపల్లిలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు శుక్రవారం ఆయన ఆకస్మిక సందర్శన చేసారు. సచివాలయాల వద్ద ప్రజలకు అందే పథకాలు, కార్యక్రమాల నిర్వహణ, వాటి ప్రగతి, లోపాలపై ఆయన సంబంధిత సిబ్బందితో ఆయన సమీక్షించారు. ప్రధానంగా ఐదేళ్ల లోపు చిన్నారుల్లోను, గర్భిణీలు, బాలింతల్లో రక్తహీనత లోపాలు గుర్తించినందున వాటిని అధిగమించేందుకు ప్రత్యేక కార్యాచరణను చేపట్టే కార్యక్రమంలో భాగంగా ఏఎన్ఎం, అంగన్‌వాడీ, వెల్ఫేర్ అసిస్టెంట్, ఇంజనీరింగ్, హౌసింగ్ తదితర అంశాలపై వాటి ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలు రక్తహీనత, బరువు తక్కువగా ఉన్నవారు ఆరుగురిని గుర్తించారు.వారికి పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. పోలసానిపల్లిలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ లేనందున అభివృద్ధి పనులు మందకొడిగా సాగుతున్నాయని, వెంటనే ఇంజనీరింగ్ అసిస్టెంట్‌ను నియమించాలని సంబంధిత పీఆర్ డీఈ శ్రీనివాస్‌ను ఆదేశించారు. సచివాలయాల్లోని సేవలన్నీ ప్రజలకు సత్వరమే అందించాలని, లేని పక్షంలో శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామంలోని 21 ఏళ్ల లోపు గల డ్రాపవుట్స్‌ను ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో చేర్పించాలని, నూరు శాతం ఎన్‌రోల్ చేయాల్సిన బాధ్యత వెల్ఫేర్ అసిస్టెంట్లపై ఉందన్నారు. అర్హులందరికీ పింఛన్లు అందుతాయన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం తగు శ్రద్ధ వహించాలని కోరారు. హౌసింగ్ ఏఈ సతీష్, ఏపీఎం సురేష్, సూపర్‌వైజర్ షాహనాజ్‌బేగం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దోమలతోనే వ్యాధుల వ్యాప్తి

గణపవరం: అన్ని వ్యాధులకు మూలం దోమలేనని, వాటి నివారణతో వ్యాధులకు దూరంగా, ఆరోగ్యవంతమైన జీవనం సాగించవచ్చునని గణపవరం, పిప్పర పీహెచ్‌సీ వైద్యాధికారులు పులపర్తి సంతోష్, కిరణ్మయి, కె.ప్రియాంక అన్నారు. శుక్రవారం ఫ్రైడే, డ్రైడే సందర్భంగా పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాలలో వైద్య, పంచాయతీ సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి అపరిశుభ్రత, దోమల వ్యాప్తి, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో జాలాది విల్సన్, ఆరోగ్య సహాయకులు యోహాన్, నామాలరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సోమరాజుకు అభినందనలు



నడింపల్లి సోమరాజు

గణపవరం: వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా కార్యదర్శిగా ఉంగుటూరు నియోజకవర్గం గణపవరానికి చెందిన నడింపల్లి సోమరాజు నియమితులవడంపై పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈయన ఈ పదవికి ఎంపిక కావడం వరుసగా ఇది మూడోసారి. గురువారం ఏలూరు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ఆళ్లనాని ప్రకటించిన జిల్లా కమిటీలో సోమరాజును జిల్లా కార్యదర్శిగా నియమించారు. గతంలో ఆళ్లనాని, పుప్పాల వాసుబాబు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడిగా పనిచేసిన కాలంలో సోమరాజు జిల్లా పార్టీ కార్యదర్శిగా పనిచేశారు. గతంలో గణపవరం మండల పార్టీ అధ్యక్షుడిగా పనిచేశారు. ఈ సందర్భంగా సోమరాజు మాట్లాడుతూ వచ్చే సాధారణ ఎన్నికలలో పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకురావడానికి ఎమ్మెల్యే వాసుబాబు సారథ్యంలో శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. సోమరాజు నియామకంపై ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, రాష్ట్ర సూర్యబలిజ కార్పొరేషన్ చైర్మన్ శెట్టి అనంతలక్ష్మి, నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు వేండ్ర వెంకటస్వామి, గణపవరం ఎంపీపీ అర్ధవరం రాము, జెడ్పీటీసీ సభ్యురాలు దేవారపు సోమలక్ష్మి, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దండు రాము తదితరులు అభినందనలు తెలిపారు.

వ్యాయామ విద్యకు ఉజ్వల భవిష్యత్తు

దెందులూరు: వ్యాయామ విద్యకు ఉజ్వల భవిష్యత్తు కచ్చితమైన ఉద్యోగ భద్రత ఉందని బుట్టాయగూడెం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పీ. మహేంద్రరావు అన్నారు. శుక్రవారం వ్యాయామ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.నత్తానియేలు అధ్యక్షతన వ్యాయామ విద్య, ప్రాధాన్యత అనే అంశంపై సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రిన్సిపల్ మహేంద్రరావు మాట్లాడుతూ శిక్షణ సమయంలో విద్యార్థులు క్రమశిక్షణతో ఎంచుకున్న లక్ష్యాలు అధిగమించేందుకు కృషి చేయాలన్నారు. అధ్యాపకులు ఆర్.సతీష్, భవాని, ప్రసాద్ ఉన్నారు.

అచ్చమ్మ పేరంటాలమ్మ ఆలయంలో వరలక్ష్మీ వ్రతం



గాలాయగూడెం అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లికి సారె తీసుకువస్తున్న భక్తులు

దెందులూరు: కోస్తా జిల్లాలోనే నమ్మికొలిచిన భక్తులకు కొంగుబంగారంగా ఇలవేల్పుగా విరాజిల్లుతున్న గాలాయగూడెం అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఆలయంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం వేడుకలు భక్తిశ్రద్ధలతో ఉత్సవ కమిటీ, గ్రామస్తుల సంయుక్త ఆధ్వర్యంలో జరిగాయి. అమ్మవారికి పసుపు, కుంకుమ, పంచామృతాలతో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. సన్నాయిమేళాల నడుమ గ్రామ శివారు ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం నుంచి ఊరేగింపుగా ఆడపడుచులు కలశాలతో గ్రామంతా ఊరేగింపు నిర్వహించారు. 11 రకాలతో పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలు, సారె, నైవేద్యం తీసుకుని అమ్మవారికి గాలాయగూడెంతో పాటు శివారు ప్రాంతాలు వారు సమర్పించారు. ఆలయ వేద పండితులు సతీష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

నేడు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పెదపాడు: పెదపాడు మండలంలోని గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి శనివారం శంకుస్థాపన చేయనున్నట్లు పెదపాడు మండల కన్వీనర్ అప్పన ప్రసాద్ తెలిపారు. శనివారం ఉదయం 9.30గంటలకు రూ.3కోట్ల వ్యయంతో పెదపాడు మండలంలోని కొత్తూరు–వీరమ్మకుంట–పెదపాడు ఆర్‌అండ్‌బీ రహదారి నిర్మాణం, ఉదయం 10.45 గంటలకు వీరమ్మకుంటలో రూ.50లక్షల వ్యయంతో పైపు లైను నిర్మాణం, అనంతరం జిల్లా పరిషత్ నిధులతో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపనలు చేసి ప్రజల నుద్దేశించి ప్రసంగిస్తారని చెప్పారు. మధ్యాహ్నం 3గంటల నుంచి పెదపాడు–గుడిపాడు– వడ్డిగూడెం రహదారిని అభివృద్ధికి రూ.4కోట్ల వ్యయంతో శంకుస్థాపనలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని తెలిపారు.